# ష్... మాట్లాడకు



''వినయ్ ఈరోజు ఆరుగంటలకి ట్యాంక్ బండ్ దగ్గరకు రావటం మరువకేం'' ప్రీతి.

''లేదు ప్రీతీ నా జియాలజీ రికార్డ్ రేపే సబ్ మిట్ చెయ్యాలి! కాబట్టి...'' పలికాడు వినయ్.

''ష్! మాట్లాడకు! ఆరుగంటలకు నువ్వు టాంక్ బండ్ వద్ద నా కోసం ఎదురుచూస్తున్నావ్... ఓ.కె.'' అంటూ వెళ్ళిపోయింది ప్రీతి.

సాయంకాలం ఆరు. ప్రదేశం ట్యాంక్ బండ్. వినయ్ ఒడిలో ప్రీతి. ''వినయ్ డార్లింగ్ 'శైలజ'లో మంచి ఇంగ్లీష్ మూవీ వేస్తున్నారట. రేపు ఫస్ట్‌షోకెళదాం. టికెట్స్ బుక్ చేస్తావుగా'' గారంగా ప్రీతి.

''రేపు మా డాడీ వాళ్ళు వస్తున్నారనీ లెటర్ రాసారు ప్రీతీ... అందుకనీ నీతో రావడం కుదరదేమో!'' సంశయించాడు వినయ్.

''ష్ మరి మాట్లాడకు! రేపు నువ్వూ నేనూ కలిసి 'శైలజా'లో ఫస్ట్ షోకి వెళుతున్నాం... దట్సాల్'' ఆర్డర్ జారీ చేసింది ప్రీతి.

మూవీ అయ్యాక థియేటర్ నుంచీ బయటకు వస్తూ ''వినీ డియర్! వచ్చే సండే ఏదైనా మంచి పిక్‌నిక్ స్పాట్ చూసుకుని వెళ్దాం... ఏమంటావ్'' అంది ప్రీతి.

''ప్లీజ్ ప్రీతీ... నన్నర్థం చేసుకో ఎగ్జామ్స్ దగ్గర పడుతున్నాయ్!... చదవకపోతే డాక్టర్‌ని కాదు కదా... కాంపౌండర్‌ని కూడా కాలేను''.

''అబ్బబ్బా! వినయ్... నిన్నడగటం నాదే తప్పు. నిన్నడక్కుండానే ఫిక్స్ చెయ్యాల్సింది మా ఫ్రెండ్స్‌తో నేనూ, మీ ఫ్రెండ్స్‌తో నువ్వూ... నెక్స్ట సన్డే పిక్‌నిక్‌కి వెళుతున్నాం' ఇక నువ్వు మాట్లాడకు నిముక్కుంది ప్రీతి.

తప్పదు అన్నట్లు తలాడించాడు వినయ్.

***

తెచ్చుకున్న ఆహార పదార్థాలన్నీ అందరూ కలిసి జోక్స్ వేసుకుంటూ ఆరగించారు. గ్రూప్స్‌గా విడిపోయి ఎవరికిష్టంవచ్చిన గేమ్ వాళ్ళాడుకుంటున్నారు. వినయ్ సాగిలబడ్డాడు.

అతనికి దగ్గరగా వచ్చి ''అలా వెళ్ళొద్దాం... రారాదూ! వినయ్'' పిలిచింది ప్రీతి.

''ప్రీతీ... ఎండగా వున్నట్లుంది... కాస్సేపాగరాదూ'' కళ్ళు మూసుకుంటూ పలికాడు వినయ్.

''ష్... మాట్లాడకు! ఎవరైనా వింటారు... కాస్త ముందుకెళ్ళి ఏదైనా పెద్ద చెట్టు కింద కూర్చుందాం... ఫ్రీగా మాట్లాడుకోవచ్చు కూడా'' నెమ్మదిగా వివరించింది.

''సరే... పద'' అంటూ అప్రసన్నంగా కదిలాడు వినయ్. ఒక విశాలమైన వృక్షం క్రింద ఇద్దరూ విశ్రమించారు.

''వినయ్... ఐ లవ్యూ... ఐ లైక్ యూ... ఐ వాంట్యూ'' అంటూ పెనవేసుకుపోయింది ఆత్రంగా. ఉద్భవించిన వేడికి తనూ కరుసుతూ'' ఐ లవ్యూ టూ మచ్... ప్రీతి'' అంటూ ఆమెను చుట్టుకుపోయాడు. కొద్ది సేపయ్యాక ఇద్దరు విడిపోయి బట్టలు సర్దుకుని ఎవరికి వారే విడివిడిగా ఫ్రెండ్స్ దగ్గరకు వెళ్ళిపోయారు.

మరునాడు కాలేజీలో ''వినయ్ సాయంకాలం బీచ్‌కి రా!'' పిలిచింది ప్రీతి.

'అలాగే' అంటూ తల ఊపాడు.

బీచ్‌లో ఒక పొద ప్రక్కగా కూర్చున్నారు. తమకాన్ని ఆపుకోలేక ఆమెను గట్టిగా పెనవేసుకున్నాడు వినయ్. ఎంత గట్టిగా అంటే అరగంట వరకూ ఇరువురూ వేరుకాలేకపోయినంత.

**వి. మణిమాల**

కాస్సేపటిలోనే ఇద్దరిలోని ఆవేశం, వేడీ తగ్గి... వేరయ్యారు. విషయంలోకి వచ్చింది ప్రీతి.

''వినయ్ మనం పెళ్ళెప్పుడు చేసుకుందాం?'' సిగ్గుపడుతూ అడిగింది ప్రీతి తలదించుకుని మరీ వినయ్‌ని.

''పెళ్ళా... నేనా... నిన్నా... ష్ మాట్లాడకు ఎవరైనా వింటారు'' అంటూ కదిలి చకచకా అడుగులేసుకొని వెళ్ళిపోయాడు వినయ్.

